# సంబంధం

దుర్గ్ నుంచి పాట్నా వెళ్ళే దక్షిణ బీహార్ ఎక్స్‌ప్రెస్ ఐదవ నెంబరు ప్లాట్‌ఫాంమీద బయలుదేరుటకు సిద్ధముగా ఉన్నది అన్న ఎనౌన్స్‌మెంట్ ఇంగ్లీషులో వస్తున్నప్పుడు విశ్వనాథరావు స్టేషనుకి వచ్చాడు. అతడు ఆదరాబాదరా టిక్కెట్టు తీసుకుని తను వెళ్ళేవరకు రైలు ఆగుతుందా అన్న అనుమానంతో ఓవర్ బ్రిడ్జ్ మీదుగా ఐదవ నెంబరు ప్లాట్‌ఫాంమీదకు వచ్చి ఇంజన్‌వైపు వున్న జనరల్ కంపార్టుమెంట్ ఎక్కాడు.

అప్పుడతని గుండె కుదుటపడింది. 'అమ్మయ్య' అనుకున్నాడు. అతని తండ్రి ఉదయమే ఫోన్‌చేసి మొదటిబండిలో బయలుదేరిరా అంటూ చెప్పాడు.

సాధారణంగా స్లీపర్‌క్లాసులో బెర్తు రిజర్వు చేసుకుని ఇంటికి బయలుదేరేవాడు. జనరల్ బోగిలో జనం విపరీతంగా వుంటారు దూర ప్రయాణం దుర్భరమౌతుందని అతని భయం.

అతను ఎక్కిన బోగీలో సీట్లు ఖాళీగా వున్నాయి. సీటు దొరికినందుకు ఒకపక్క ఆనందం, ఈ రోజు బండి ఇంత ఖాళీగా వుందేం అన్న ఆశ్చర్యం వేరొకపక్క కలిగాయి.

ఎటాచీని పైబెర్తు మీద చైన్ లాక్‌చేసి వెంటతెచ్చుకున్న బాటిల్‌లోని నీరు తాగాడు. ఆందోళన, అలసట ఒక్కమారు మాయమయ్యాయి. తన సీటుకి దగ్గరలోని కిటికీ దగ్గర సింగిల్ సీటులో ఓ వారపత్రికను చూడగానే ఎవరో తెలుగాయన ప్రయాణం చేస్తున్నాడు తనకు కాలక్షేపానికి కొదువలేదనుకున్నాడు విశ్వనాథరావు.

బయలుదేరుటకు సిద్ధంగా వుంది అన్న రైలు పదినిముషాలు గడిచినా కదల్లేదు. కారణం తెలుసుకోవాలన్న కోరికతో బండి దిగి తన బోగీముందు బోగీని దాటి ఇంజనువరకు వెళ్ళాడు.

విశాఖపట్నంనుంచి ఏదో బండి వస్తున్నదని అది స్టేషనులోనికి వచ్చేవరకు ఎక్స్‌ప్రెస్ కదలదని తెలుసుకున్నాడు. తిరిగి తన కంపార్టుమెంట్‌కు వస్తూవుంటే లేడీస్ బోగీలో కిటికీవద్ద ఒక యువతి కనిపించింది. కళ్ళు చెదిరే అందం ఎక్కడెక్కడి అందాలను ఒకచోట చేర్చి విధాత ఆ పిల్లను పోతపోశాడా అని అనిపించింది.

అక్కడ నుంచి అడుగు ముందుకు వేయలేకపోయాడు. అటునుంచి కళ్ళుతిప్పుకోలేకపోయాడు. కనులతోనే ఆమె అందాలను ఆస్వాదించసాగాడు. అదే కిటికీ దగ్గర

బయట నిలబడిన యువకుడి దృష్టి విశ్వనాథరావు మీద పడింది. అతనలా చూడగానే తప్పుచేసినవాడిలా బాధపడ్డాడు. ఆ యువకుడేమన్నాడో ఆ యువతి ముఖం అటు తిప్పేసుకుంది.

'తను ఎంత పాడుపని చేశాడు?' అంతలోనే అటునుంచి రావలసిన గూడ్సు రావడం, ఎక్స్‌ప్రెస్ కూత వేయడం జరిగాయి. ఆఖరిసారి ఆ కిటికీవంక చూసి తన సీటులో కూర్చున్నాడు.

వారపత్రిక వున్న సీటు ఇంకా ఖాళీగానే ఉంది. బండి బయలుదేరిన తరువాత ఆ సీటులోని వ్యక్తి వచ్చి కూర్చున్నాడు. అతడ్ని చూడగానే విశ్వనాథరావు గతుక్కుమన్నాడు. తను ఆ యువతిని చూస్తూ ఇతనికే పట్టుబడ్డాడు. ఇప్పుడతను తనకు అతిదగ్గరలో కూర్చున్నాడు. పైగా వాళ్ళమధ్య ఏదో సంబంధం వుంది. తను క్షమించరాని అపరాధం చేసినట్లు విశ్వనాథరావుకి అనిపించింది.

ఆ యువకుడు విశ్వనాథరావుని చూడనే చూశాడు. 'ఏమనుకుంటున్నాడో? నన్ను ఒక లోఫర్‌గా భావిస్తున్నాడా? ప్రయాణాలలో ఒంటరి ఆడపిల్లలను అల్లరిపాలు చేసే రౌడీని అనుకుంటున్నాడా? అతని చూపుల అర్థం ఏమిటి?'

'మీతో సంబంధంవున్న ఆమెను నేను తదేకంగా చూసినందుకు నన్ను అపార్థంచేసుకోకండి. ఆమె అందం నన్ను పరవశుడ్ని చేసింది. నా కాళ్ళు బంధించబడ్డాయి. ఆమెను ఆరాధనాభావంతోనే చూశాను. నేను బద్మాషును కాను. సమాజంలో గౌరవంగా బతుకుతున్నవాడిని' అని చెప్పాలనిపించింది విశ్వనాథరావుకి.

గుమ్మడికాయలదొంగ అంటే భుజాలు తడుముకున్నట్లు తనామాట అంటే నిజంగా అతనికి దురభిప్రాయం కల్గుతుంది. రైళ్ళలోను, బస్సులలోను, వీధుల్లోను ఆడవాళ్లను పురుషులు సహజంగానే చూస్తారు. మరి తను చేసింది నేరం ఎందుకౌతుంది? తను క్షమాపణ ఎందుకు చెప్పుకోవాలి, అలాచెప్పుకొని అతని దృష్టిలో చులకనెందుకు కావాలి? విశ్వనాథరావు బాగా ఆలోచించి ఆ మాట అనలేదు.

కొంతసేపు మౌనంగా వుండి "మీరు తెలుగు వారా?" అని అడిగాడు, తనూ తెలుగువాడినే అని అతనికి తెలియాలని, అతను విశ్వనాథరావు వంక చూసి "ఊ" అని ముక్తసరిగా జవాబిచ్చాడు.

అతనితో మాటలాడుతూ మాటలమధ్య ఆపిల్ల ఎవరో ఆమెతో ఇతనికెలాంటి సంబంధం వుందో తెలుసుకోవాలన్న కోర్కె కలిగింది.

తన కాబోయే భార్య ఆమెలాంటి అందగత్తె అయితే ఎంత అదృష్టం అనుకున్నాడు. పెళ్ళిచూపులకోసమే తనను తండ్రి రమ్మన్నాడని కూడా విశ్వనాథరావు ఊహించాడు. తను

చూడబోయే పిల్ల ఈమె అంత అందగత్తె కాకపోతే తను ఆమెను చేసుకోవడానికి అంగీకరిస్తాడా?

"మీరూ నాలాగే అనుకోకుండా బయలుదేరినట్లుంది. రిజర్వేషను బోగీలో ప్రయత్నించలేదా? బండిలో రద్దీగా వుంటుందని మీ భార్యను లేడీస్ కంపార్టుమెంట్‌లో కూర్చోపెట్టి మీరు ఒంటరిగా ఇక్కడ కూర్చున్నారా?" అన్నాడు విశ్వనాథరావు.

పుస్తకాన్ని మడిచి చెప్పినదంతా అతను విన్నాడు "ఆమె నాభార్య కాదు"

అతని భార్య కాదని తెలుసుకుని సంతోషించాడు. బహుశా ఆ పిల్లకింకా పెళ్ళి అయి వుండదు. వివరాలు తెలుసుకోవాలన్న కోరిక బలీయమైంది.

"సారీ ! క్షమించండి, నేను పొరపాటుపడ్డాను. మీరామెతో మాట్లాడుతూ వుంటే చూశాను. బహుశా ఆమె మీ చెల్లెలై వుంటుంది" అన్నాడు విశ్వనాథరావు.

"ఆమె నా చెల్లెలు కాదు" అదే ముక్తసరి జవాబు.

"అలాగా! ఆడవాళ్ళ వయసును అంచనా వేయడం అంత తేలిక కాదు. ఒక పర్యాయం నేను పనిచేస్తున్న కాలేజీకి ఒకామె వచ్చింది. అది అడ్మిషన్ల సీజను. 'మీరు అడ్మిషన్‌కోసం వచ్చారా?' అని ప్రిన్సిపాల్ ఆమెనడిగాడు. 'ఔను, మా అమ్మాయి అడ్మిషన్ కోసం' అని ఆమె బదులు చెప్పింది.

ఆ యువతి వయసు నలభైఏళ్ళు. ఆమెకు పద్దెనిమిది ఏళ్ళ కూతురుందటే నమ్మశక్యంకాలేదు. ఇరవైమూడు-ఇరవైనాలుగేళ్ళ పిల్లలాగుంది. లేడీస్ కంపార్టుమెంట్‌లో ఆమె మీ అక్కగారైవుంటారు" అన్నాడు విశ్వనాథరావు.

"ఆమె నా అక్క కాదు"

"సారీ! నేను మళ్ళీ పప్పులో కాలేశాను. నా అంచనా తప్పయింది. మీ ఇద్దరూ చూడడానికి ఒకేతల్లిబిడ్డల్లా వున్నారు. అందుకే మీరు ఏకోదరులనుకున్నాను. బహుశా ఆమె మీ మేనత్త లేదా మీ మేనమామ కూతురు కాబోలు. అలాంటి సంబంధమైనా పోలికలు కలుస్తాయి" అన్నాడు విశ్వనాథరావు.

ఈ పర్యాయం ఆ యువకుడు విశ్వనాథరావు వంక చూశాడు. నీకెందుకు మా విషయాలు అనా ఆ చూపు అర్థం. అయితే అతడు శాంతంగానే వున్నాడు. "మీరనుకున్నదేం కాదు" జవాబిచ్చి తిరిగి పుస్తకం తెరిచాడు. ఆ పుస్తకంలో ఏముంది? తోటి తెలుగువాడితో మాటల్లో పడితే కాలక్షేపం కాదా?

"నేననుకున్నదేదీ కానప్పుడు మీమధ్య సంబంధం ఏమిటో మీరే చెప్తేపోలా? నన్నెందుకు

కాల్చుకుతింటావు?' అని అనుకున్నాడు విశ్వనాథరావు.

ఆమె ఇతని భార్య కాదు, చెల్లెలు కాదు, అక్క అంతకన్నాకాదు, మరదలు లేదా వదిన కానేకాదు. మరి ఎవరు? అతని బుర్ర పనిచేయడం మానేసింది. ఆమె ఎవరైతే తనకేం? వాళ్ళతో తనకేమిటి సంబంధం? ఎంతసేపూ తను వాగుతున్నాడే కాని అతడు సరిగ్గా సమాధానాలు చెప్పడంలేదు.

కొన్ని గంటలు కలిసి ప్రయాణం చేయాలి. అలా అంతసేపు పుస్తకం చూస్తూ కూర్చుంటే అతనికి విసుగ్గా లేదా? అనవసరంగా తను బుర్ర పాడుచేసుకుంటున్నాడు. ఆమె ఎవరో తెలుసుకోవాలన్న తపన మరింత తీవ్రమైంది. అనుకున్నది సాధిస్తేనే కాని మనసు కుదుటపడదు.

ఇంతలో టిల్డాస్టేషను వచ్చింది. ముందుగానే ఆ స్టేషను కోసం ఎదురుచూస్తున్న ఆ యువకుడు సీటుమీద వారపత్రిక వుంచి గేటు దగ్గరకు వెళ్ళాడు.

ఇంకెక్కడికి వెళ్తాడు, ఆమెను కలుసుకుని మాట్లాడడానికి కాక? ఏదో దగ్గర సంబంధం కాకపోతే అతను ఈ చిన్నస్టేషనులో దిగుతాడా? బండి రెండు నిమిషాలైనా ఆగదే. విశ్వనాథరావు గేటు వరకు వెళ్ళాడు. అప్పటికే అతను చాయ్‌వాలా దగ్గర టీ తీసుకుని లేడీస్ కంపార్టుమెంట్ వద్దకెళ్ళాడు. ఆమెకు టీ ఇచ్చి వస్తూ మరో టీ తీసుకుని తనసీటు దగ్గరకొచ్చి టీ తాగసాగాడు నింపాదిగా.

"మీరేకాదు మీతో ప్రయాణం చేస్తున్న ఆమె కూడా టీలు ఎక్కువగా తాగుతుందా? రాయపూర్‌లో మీరిద్దరూ టీలు తాగడం నేను చూశాను. ఆ పిల్ల అంటే మీకు చాలా అభిమానం లాగుంది. ఆ పిల్ల యోగక్షేమాలు కనుక్కుంటున్నారు. ఆమె మీ గర్ల్‌ఫ్రెండా? మీరిద్దరూ పెళ్లిచేసుకోవాలనుకుంటున్నారు లాగుంది. మీ సెలక్షన్ని అభినందిస్తున్నాను" అన్నాడు విశ్వనాథరావు.

"ఆమె నా గర్ల్ ఫ్రెండ్ కాదు"

'కాదా, మరి ఎవరైవుంటారు? అతనికామె ఏమి కానప్పుడు ఇతడెందుకు ఆ పిల్లపట్ల అంత శ్రద్ధ చూపుతున్నాడు. స్త్రీపురుషులమధ్య మరెలాంటి సంబంధాలుంటాయి?' కొంతసేపు బుర్రగోక్కున్నాడు. 'ఆ తెలిసెన్' అని అనుకున్నాడు.

"నేను ప్రతీమారు మీమధ్య సంబంధాన్ని తప్పుగా అంచనావేశాను. మీరు కాలేజీ విద్యార్థి అయితే ఆమె కూడా మీతోపాటు చదువుతూవుండాలి. లేదా మీరు నాలా ఉద్యోగిఅయితే ఆమె మీ కొలీగ్ అయి వుంటుంది. ఔనంటారా?" అన్నాడు విశ్వనాథరావు.

"కాదనే అంటాను. మామధ్య అలాంటి సంబంధంలేదు" అని చెప్పాడతను.

మరి ఇతని జోలికి వెళ్ళడం వృథా అని అనిపించింది. "ఆ వారపత్రిక మీరంతగా చదువుతున్నారు. అందులో ఏముంది? ఓసారి ఇస్తారా?" అనడిగాడు.

అతను ఆ వారపత్రికను ఇచ్చి పై లగేజి రాక్‌మీద వుంచిన సంచిలోంచి మరో పత్రిక తీశాడు.

విశ్వనాథరావు ఆ పత్రికను చూశాడు. అది ఇప్పుడు వెలువడిన తాజా సంచిక కాదు. గత సంవత్సరానిది. రైలులో కాలక్షేపానికి ఏవో పాత పుస్తకాలు రెండోమూడో సంచీలో వేసుకునివుంటాడు.

విశ్వనాథరావు పేజీలు తిప్పుతున్నాడుకాని ఏమీ చదవా లనిపించడంలేదు. ఆ వ్యక్తి మాత్రం కొత్త పుస్తకంలో తలదూర్చాడు. ఇతడొక చదువులపురుగు కాబోలు. ఇంతలో బండి బాటావారాలో ఆగింది. ఆ యువకుడు యథాప్రకారం సీటుమీద పుస్తకం వుంచి మళ్ళీ రైలు దిగాడు.

విశ్వనాథరావుకి అతడ్ని అనుసరించాలనికాని, గమనించాలనికాని అనిపించలేదు. అతను రైలు బయలుదేరే వేళకు తిరిగొచ్చి సీటులో కూర్చుని మళ్ళీ పుస్తకం పఠనంలో నిమగ్నుడయ్యాడు.

"ఆమెను కలిసివచ్చారా? మన బోగీలో పెద్ద రష్ లేదు. ఆమెకక్కడ సౌకర్యంగానే వుందా? మాటిమాటికి వెళ్ళడానికి మీరు శ్రమపడుతున్నారు.

ఆమె మీ ఇరుగుపొరుగున వుంటున్నవారి పిల్లకాబోలు. ఒంటరిగా ఆమెను ఆమె తల్లిదండ్రులు రైలెక్కించి, మీరు కూడా ఇదే రైల్లో ప్రయాణం చేస్తూ వుంటే కాస్త చూస్తూవుండమని వాళ్ళు కోరివుంటారు. అందుకే రైలాగిన ప్రతీ స్టేషనులోను దిగి ఆమెను పలకరించి వస్తున్నారు."

"కాదు, మీరనుకున్నది కాదు" అన్నాడు.

ఇతనితో ఇంకెలా మాట్లాడడం? ప్రతీదానికి కాదనే అంటాడు. లోకంలో స్త్రీపురుషుల మధ్య వుండే అన్ని సంబంధాలను తను సూచించాడు. బహుశా, ఆమె తనకేమయినది చెప్పడానికి ఇష్టంలేక ఎక్కడో అబద్ధం చెప్పాడా?

విశ్వనాథరావుకి ఒకందుకు ఆశ్చర్యం వేసింది. అనవసరమైన ప్రశ్నలు వేసి అతడ్ని తను వేధించాడు. సరియైన జవాబు రాలేదన్న కోపం తనకు వచ్చింది. కాని అతను శాంతంగానే వున్నాడు. అతడిస్థానంలో వేరొకరు వుంటే 'నీకెందుకు మామధ్య ఏ సంబంధం వుందో తెలుసుకోవడం' అంటూ కలియబడివుండేవాడు.

బైట ప్రపంచంతో తనకేం పనిలేదన్నట్లు రైలు ఉరుకులు పరుగులు వేస్తూనే వుంది. రైలుబండిలో కోలాహలం మొదలైంది. బిలాస్‌పూరులో దిగవలసివాళ్ళు సామానులు ముందుకు చేర వేస్తున్నారు. ఆ కిటికీదగ్గర కూర్చున్న యువకుడు సంచీ తీసి అందులో తనచేతిలో పుస్తకం

పెడుతూ, " మాస్టారూ పుస్తకం ఇస్తారా, నేనిక్కడే దిగాలి" అన్నాడు.

"అయ్యో ! మీరిక్కడే దిగిపోతారా? నాతోపాటు టాటావరకు వస్తారేమో ననుకున్నాను. అన్నట్లు ఆమెకు, మీకు గల సంబంధం నాకు అంతుపట్టడం లేదు. మీ వయసులు చూస్తే ఆమె మీ అమ్మగారు కాని, అత్తగారు కాని లేదా పిన్నికాని కాదని అనిపిస్తున్నది" అన్నాడు విశ్వనాథరావు.

"నిజమే, ఆమె నా కన్నతల్లి కాదు, నాకింకా పెళ్ళికాలేదు, మా అమ్మ అక్కకాని, చెల్లెలుకాని కానేకాదు" చెప్పాడతను.

"ఆగండి. మీ మధ్యగల సంబంధం తెలుసుకోవలసిన అవసరం నాకు లేదు. అయితే తెలుసుకోవాలన్న కోర్కెకలిగింది. నేను ఆలోచించి ఆలోచించి పిచ్చివాడినౌతున్నాను. మీ మధ్య సంబంధం ఏమిటో చెప్పి మరీ దిగండి" అన్నాడు విశ్వనాథరావు.

"ఈ ప్రశ్న మీరు సరిగా వేసివుండవలసినది. మా మధ్య ఎలాంటి అక్రమ సంబంధం లేదు. మీరు డొంక తిరుగుడు ప్రశ్నలు వేశారు. అందువలన సరియైన సమాధానం నానుంచిరాలేదు. ఆమె మానాన్న గారి రెండవ భార్య. మాఅమ్మ రెండేళ్ళ క్రితం చనిపోయింది" అంటూ అతను దిగిపోయాడు.

ఆ మాట వినగానే అతనికి అమితంగా దుఃఖం వచ్చింది. 'అంత అపురూప సౌందర్యవతి ఒకనికి రెండవ భార్య కావలసివచ్చిందా? ఈ దేశంలో ఆడపిల్లల దౌర్భాగ్యం అది. కట్నం ఇచ్చుకోలేని కుటుంబాలలో ఆడపిల్లలకు పెళ్ళి జరగడం కష్టం.

గత్యంతరం లేక రెండో పెళ్ళివాడిచేత పుస్తెముడి కట్టించుకోవాలి. ఆమె తనకు ఈడూజోడు అయినదే. ముందుగా ఆ పిల్ల గురించి తెలిస్తే ఆమెను వదులుకునేవాడినా?' అని అనుకున్నాడు.

ఆ వ్యక్తిఖాళీ చేసిన సీటులోకి మారి కిటికీనుంచి బయటకు చూస్తున్నాడు. వాళ్ళిద్దరూ వస్తున్నారు.

ఆ పిల్ల అవిటిదికాబోలు రెండు ఊతకర్రల సహాయంతో నడుస్తున్నది. రెండు చేతుల్లో రెండు పెట్టెలు పట్టుకుని ఆ యువకు డామెను అనుసరిస్తున్నాడు. ఇంత అందమైన యువతికి అవిటితనం ఆపాదించాడా ఆ సృష్టికర్త? ఇంతవరకు తన ఆలోచనలెలా ఉన్నాయి? చూస్తూ చూస్తూ ఒక అవిటిదాన్ని తను చేసుకోగలడా?

ఆమెకు మొగుడు దొరికాడు. కన్నకొడుకు లాంటి సవతికొడుకు దొరికాడు.

అవిటిదైతేనేం ఆమె అదృష్టవంతురాలు అనుకున్నాడు విశ్వనాథరావు.

- స్వాతి మాసపత్రిక డిసెంబరు 2006